సాక్షి
ములుగు
శనివారం | 23 | మార్చి | 2024



పీడీఎస్ బియ్యం పట్టివేత
కాళేశ్వరం జాతీయ రహదారి 353(సీ) మీదుగా మహారాష్ట్రకు తరలుతున్న 700 క్వింటాళ్ల రెండు లారీలు, రెండు బొలెరా వాహనాలను పట్టుకున్నారు. - 8లో▸



శిల్పమా.. రాయా..!
రామప్ప దేవాలయ ఆవరణలో పురావస్తుశాఖ సిబ్బంది పైపులైన్ నిర్మాణం కోసం చేపట్టిన తవ్వకాల్లో 5 ఫీట్ల పొడవుతో ఉన్న శిల్పం లాంటి రాయి వెలుగుచూసింది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$39.4^0/21.4^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత ఉంటుంది.



న్యూస్‌రీల్

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



వెంకటాపురం(ఎం): పోషకాలతో కూడిన పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని వెంకటాపురం సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కమరున్నీసా బేగం అన్నారు. శుక్రవారం మండలంలోని లక్ష్మీదేవిపేట అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ పక్వాడా కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. చిరుధాన్యాలు, గుడ్లు, ఆకు కూరలతో కలిగే లాభాలను బాలింతలు, గర్భిణులకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మద్దెల సంధ్య, కొండ మాధవి, రజిని, సబిత, గీత, ఎఎన్‌ఎంలు స్వర్ణలత, వజ్ర తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత



కాటారం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని కాటారం మండలం మద్దులపల్లి చెక్‌పోస్టు వద్ద శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై అభినవ్ తెలిపారు. చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు చేపడుతుండగా అనుమానం వచ్చి ఇసుక లారీని ఆపి వే బిల్లు చూపించమని అడగగా డ్రైవర్ పొంతన లేని సమాధానం చెప్పినట్లు ఎస్సై పేర్కొన్నారు. అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడుతున్నట్లు గుర్తించి లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. దేవరాంపల్లి శివారులో ఇసుక లోడ్ చేసుకొని వెళ్తున్నట్లు తెలిసిందన్నారు. డ్రైవర్ సయ్యద్ ముజాహిద్, లారీ ఓనర్ విజయ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చేపల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలి

భూపాలపల్లి రూరల్: ఎండలతో చెరువుల్లో చేపలు మృతి చెందుతున్నాయని.. మత్స్యకారులు నష్టపోకుండా ఉండేందుకు పలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చెరువులోని నీటి నాణ్యత, లోతు విస్తీర్ణం, చేపల కదలికలను గమనించాలన్నారు. చెరువుల్లో పూర్తిస్థాయిలో నీటి మట్టం తగ్గుతున్న సందర్భంలో అధికారుల సూచనల మేరకు చేపలను పట్టడం శ్రేయస్కరం అని తెలిపారు.

కొలతల ప్రకారం పనిచేయాలి



చిట్యాల: ఉపాధిహామీ కూలీలు కొలతల ప్రకారం పనిచేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నరేష్ అన్నారు. మండలకేంద్రంలోని ఉపాధిహామీ పనులను శుక్రవారం ఆయన సందర్శించారు. అనంతరం కూలీలతో మాట్లాడుతూ రూ.272 కూలి వచ్చే విధంగా కొలతల ప్రకారం పని చేయాలని అన్నారు. కూలీలు ఉదయం పూటనే పనికి వచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఎండాకాలం కావడంతో వడదెబ్బకు గురికావద్దని తెలిపారు. కూలీలు పనిచేసే చోట వారికి తాగునీరు, ప్రథమ చికిత్స సౌకర్యం అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి రవికుమార్‌ను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ రామయ్య, టీఏ సుధాకర్, సిబ్బంది షఫీ, కూలీలు తదితరులు ఉన్నారు.

ఆరోగ్యం.. ఆదాయం

తేనెతో అనేక ప్రయోజనాలు
- తేనెటీగల పెంపకంపై గిరిజనులకు శిక్షణ
- పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభం



ఎస్ఎస్ తాడ్వాయి : తేనె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని మనందరికీ తెలుసు. అయితే ప్రస్తుతం మార్కెట్‌లో వివిధ కంపెనీల పేరుతో తేనెను విక్రయిస్తున్నారు. అయినప్పటికీ గిరిజన ప్రాంతాల్లో దొరికే తేనెకు మాత్రం గిరాకీ తగ్గడంలేదు. ఈక్రమంలో వైల్డ్‌లైఫ్ అటవీశాఖ ఆధ్వర్యంలో గిరిజనులకు తేనెటీగల పెంపకంపై శిక్షణ ఇచ్చి వారు ఆర్థికంగా బలపడేందుకు కృషి చేస్తున్నారు. శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకంపై గిరిజనులకు చైతన్యం చేస్తున్నారు. అటవీ ప్రాంతంలో సహజసిద్ధంగా తేనెటీగలు తేనె తెట్టలను పెడుతుంటాయి. గిరిజనులు ఆ తేనెను సేకరించి సొమ్ము చేసుకుంటారు. స్వచ్ఛమైన తేనెతో ఆరోగ్యం ఉండటంతోపాటు సర్వరోగ నివారణకు ఉపయోగపడుతుందని నానుడి. దీంతో మార్కెట్‌లో తేనెకు డిమాండ్ పెరిగింది. లీటరు తేనె బాటిల్‌కు రూ.వెయ్యి చొప్పున కొనుగోలు చేస్తున్నారు. దుకాణాల్లో, మార్కెట్‌లో సాధారణంగా తేనె లభించినప్పటికీ ప్రకృతి సిద్ధంగా లభించే తేనెకు భారీ డిమాండ్. దీనిని దృష్టిలో పెట్టుకొని అటవీ శాఖ అధ్వర్యంలో అధికారులు గిరిజనులకు ఉపాధి కల్పించే విధంగా తేనె పెంపకంపై శిక్షణ ఇస్తున్నారు.

అటవీ కళాశాల పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో..

తాడ్వాయి మండల కేంద్రంలోని వన కుటీరంలో శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకంపై ఇటీవల ఆదివాసీలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. సిద్దిపేటలోని అటవీ కళాశాల పరిశోధన సంస్థ అధ్వర్యంలో డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్ పర్యవేక్షణలో.. పరిశోధన సంస్థ సహాయ ఆచార్యులు శైలజ ఆదివాసీలకు మండల కేంద్రం సమీపంలోని కామారం ఆదివాసీలు, గొత్తికోయలను సొసైటీగా ఏర్పాటు చేసి బాక్స్ ద్వారా తేనెటీగల పెంపకంపై నాలుగైదు రోజులు శిక్షణ ఇచ్చారు. బాక్స్‌తో సహా అందించే కొన్ని ఈగలతోపాటు స్థానికంగా కలిసే ఈగలతో బాక్స్‌ల్లో ఏర్పాటు చేసిన తేనెతెట్టల్లో నెల రోజుల్లోనే తేనె అందుబాటులోకి వస్తుందని, దానిని విక్రయించుకోవడం ద్వారా లభాలు పొందవచ్చని అంటున్నారు. అటవీ ప్రాంతమైన తాడ్వాయి పరిసరాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన పైలెట్ ప్రాజెక్ట్ ద్వారా తేనె సేకరణతోపాటు స్థానిక గిరిజనులకు ఉపాధి లభించనుంది. ప్రయోగాత్మకంగా నిర్వహించే ఈ ప్రాజెక్ట్ సక్సెస్ అయితే రానున్న రోజుల్లో మరిన్ని సొసైటీలు ఏర్పాటు చేసి తేనె టీగల పెంపకాన్ని విస్తరిస్తామని అధికారులు తెలిపారు.



తేనెటీగల బాక్సులు



శిక్షణ పొందిన ఆదివాసీలతో అసిస్టెంట్ ప్రొఫెసర్ శైలజ (ఫైల్)

ఆదివాసీల జీవనోపాధి కోసం శిక్షణ

గిరిజనుల జీవనోపాధి కోసం తేనెటీగల పెంపంకంపై అవగాహన కల్పించాం. గొత్తికోయలు, స్థానిక ఆదివాసీలు 25మందితో సొసైటీ ఏర్పాటు చేశాం. తేనెటీగల పెంపకం కోసం 50బాక్సులను ఏర్పాటు చేశాం. ఎఫ్‌సీఆర్ఐ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించాం. గొత్తికోయలు అడవులపై దృష్టి మళ్లకుండా ఉండేందుకు ప్రత్యామ్నాయ జీవనోపాధి కోసం తేనెటీగల పెంపకంపై శిక్షణ ఇస్తున్నాం. డీఎఫ్ఓ సమక్షంలో ఆదివాసీ యువతకు మెకానిక్, ప్లబింగ్, పేపర్ ప్లేట్ల తయారీపై శిక్షణ నిర్వహించనున్నాం. తెనేటీగల పెంపకం సక్సెస్ అయితే మరిన్ని సొసైటీలను ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తాం.

- కృష్ణవేణి, ఇన్‌చార్జ్ రేంజ్ అధికారి, తాడ్వాయి

వైద్యులు సమయపాలన పాటించాలి

అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

ఎస్ఎస్ తాడ్వాయి : వైద్యులు సమయపాలన పాటించి ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలందించాలని అదనపు కలెక్టర్ శ్రీజ తెలిపారు. మండల కేంద్రంలోని తాడ్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అదనపు కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని ఫార్మసీ గది, మందుల లభ్యతను డాక్టర్ రణధీర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇన్ పేషంట్ వార్డులో చికిత్స పొందుతున్న కొండపర్తి గ్రామానికి చెందిన ఇద్దరు గర్భిణులతో ఆస్పత్రిలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రసూతి గదిని సందర్శించారు. ఆస్పత్రిలో హాజరు పట్టికను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ.. వైద్యాధికారులు, వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, సమయపాలన పాటిస్తూ రోగులకు సేవలు అందించాలని ఆదేశించారు. కొత్తగా నియమితులైన స్టాఫ్ నర్స్‌లతో కాసేపు మాట్లాడారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ అప్పయ్య, డాక్టర్ రణధీర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శకుంతల, డీపీఎంఓ సంజీవరావు, హెల్త్ సూపర్‌వైజర్ సరస్వతి, ఫార్మసిస్ట్ నాగమణి, స్టాఫ్ నర్సులు స్పందన, రంజిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించాలి

మంత్రి సీతక్క

ఏటూరునాగారం/కన్నాయిగూడెం: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి, మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర మంత్రి సీతక్క కోరారు. ఏటూరునాగారం, కన్నాయిగూడెం మండలాల్లో శుక్రవారం ఆమె పర్యటించారు. ఈసందర్భంగా ఆయా మండలాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పోరిక బలరాంనాయక్ గెలుపుకోసం పార్టీ కార్యకర్తలు శ్రమించాలని కోరారు. అనంతరం బలరాం నాయక్ మాట్లాడుతూ.. ములుగు నియోజకవర్గానికి అనేక అభివృద్ధి పనులు చేశానని, మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. కన్నాయిగూడెం మండలం ముప్పనపల్లి వద్ద మండల అధ్యక్షుడు అప్సర్ పాషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి కార్యకర్తల సమావేశంలో సీతక్క మాట్లాడారు. అనంతరం మండలంలోని జర్నలిస్టులు మంత్రిని సన్మానించి, సమస్యలను మంత్రికి తెలపగా.. సాకూలంగా స్పందించారు. ఆయా కార్యక్రమాల్లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్, మండల అధ్యక్షుడు చిటమట రఘు, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, ఎర్రబెల్లి మనోజ్‌బాబు, సప్పిడి రాము, రాంబాబు, గౌస్, వంగపండ్ల రవి, బాల రాజు, వీసం నర్సయ్య, ఎంపీపీ జనగం సమ్మక్క, వైస్ ఎంపీపీ, భాస్కర్, జెడ్పీటీసీ చందు, జాడి రాంబాబు, రాజేందర్, అబ్బు రమేష్, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతన్న మంత్రి సీతక్క

బాల్య వివాహాలను అరికట్టాలి

ఎస్ఎస్ తాడ్వాయి : బాల్య వివాహాలను అరికట్టాలని జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో బాలల పరిరక్షణ విభాగం అధ్వర్యంలో పోషణ పక్షం కార్యక్రమాన్ని పురస్కరించుకొని బాలల హక్కుల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్వర్ణలత మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలికల అభివృద్ధికి విఘాతంగా మారుతున్నాయన్నారు. బాల్య వివాహాలతో బాలికలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బాలల హక్కులు, బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. బాల్య వివాహాలకు సహకరించిన వారి పై చట్టరీత్యా చర్యలు ఉంటాయని తెలిపారు. బాలికలపై అఘాయిత్యాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. బాలల హక్కులకు భంగం కలిగితే వెంటనే 1098/112 లేదా 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో సీడీపీఓ మల్లేశ్వరి, సూపర్‌వైజర్లు విజయ, శారద, పోషణ అభియాన్ శ్రావణి, శిరీష, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్‌వర్కర్లు జ్యోతి, రజిని, శిరీష, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్వర్ణలత

పాఠశాలకు ఆట వస్తువుల పంపిణీ

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని మేడారంలోని ఇంగ్లిష్ మీడియం గిరిజన ఆశ్రమ పాఠశాలకు స్వచ్ఛంద సంస్థ (ఆర్‌డీపీ) వారి ఆధ్వర్యంలో రూ.50వేల విలువ గల ఆట వస్తువులను శుక్రవారం అందజేశారు. వాలీబాల్, క్రికెట్ కిట్, జావలిన్ త్రోజ్, డిస్కస్ త్రోస్, లాడర్స్, చెస్, క్యారం బోర్డ్స్, వేయింగ్ మిషన్, 100 మీటర్ టేప్, స్కిప్పింగ్ రోప్, షటిల్ కిడ్స్ అందించారు. అంతేకాకుండా రూ.లక్షతో క్రీడా మైదానాన్ని చదును చేయించినట్లు తెలిపారు. ఈసందర్భంగా దాతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయలు తేజ్యా, పీడీ లక్ష్మీనారాయణ, వార్డెన్ అశ్విని, ఉపాధ్యాయులు రమణ, వెంకటలక్ష్మి, పార్వతి, లక్ష్మి, ఆర్‌డీపీ టీం లీడర్ లక్ష్మయ్య, సీఓలు రాంబాబు, రామకృష్ణ, బాబు, రమేష్, పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారు.



ఆట వస్తువులు అందజేస్తున్న సంస్థ సిబ్బంది

మెనూ ప్రకారం భోజనం అందించాలి

ఏటీడీఓ దేశిరాం

కన్నాయిగూడెం: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఏటూరునాగారం ఏటీడీఓ దేశిరాం అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని మండలం కేంద్రంతోపాటు గిరిజన పాఠశాలలు తుపాకులగూడెం ఏటూరునాగారం పరిధిలోని చల్పాక, ముకునూరు ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందజేస్తున్న ఆహార పదార్థాలపై ఆరాతీశారు. వంట గదులు, ఆహార పదార్థాలను పరిశీలించారు. అనంతరం దేశిరాం మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైన వి ద్య, నాణ్యమైన భోజనం అందించాలన్నారు. పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలిపారు. వేసవి కాలం ప్రారంభం కావడంతో తీసుకోవాలసిన జాగ్రత్తలపై ఉపాధ్యాయులకు సూచించారు. మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాలల భవనాలు, వాటి స్థితిగతులు, కావాల్సిన వసతలను హెచ్ఎం సంతోష్‌ను అడిగి తెలుకున్నారు.



పాఠశాలలో పరిశీలిస్తున్న దేశిరాం

ఒప్పందం ప్రకారం మిర్చి కొనాల్సిందే..

ఆందోళన చేసిన రైతులు

వాజేడు: సాగు చేసిన మిర్చి దిగుబడి మొత్తాన్ని కొనుగోలు చేయాలని మండల పరిధిలోని పేరూరు రైతులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏవీటీ కంపెనీతో ఒప్పందం ప్రకారం కొందరు రైతులు మిర్చి సాగు చేశారు. అయితే రసాయన నిర్ధారిత పరీక్షలో ఫెయిల్ అనప్పటికీ ఒప్పందాని కంటే రూ.వేయి తగ్గించి కొనుగోలు చేస్తామని కంపెనీ ప్రతినిధులు చెప్పారు. కానీ, రసాయనాలు ఎక్కువగా వినియోగించారనే నెపంతో శుక్రవారం మొత్తం మిర్చి బస్తాలను కొనుగోలు చేసే అవకాశం లేదని చెప్పడంతో రైతులు ఆందోళనకు దిగారు. మిర్చి కొనుగోలు చేయాల్సిందేనని పట్టుబట్టారు. తమకు ఇప్పటికే నష్టం వచ్చిందని పండిన పంటను కంపెనీ వారు కొనకపోతే భారీగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు.



ఆందోళన చేస్తున్న రైతులు

ఎన్నికల మార్గదర్శకాలపై అవగాహన అవసరం

కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు: పార్లమెంటు ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి ములుగు నియోజకవర్గం ఈఆర్ఓ ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా, అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి లోక్‌సభ ఎన్నికల నిర్వాహణ నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. సజావుగా ఎన్నికల ప్రక్రియ నిర్వాహణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై సి విజిల్ యాప్, 1950 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా ఫిర్యాదులు అందించాలి. రాజకీయ పార్టీల సమావేశాలు, ర్యాలీలకు ముందస్తు అనుమతి తప్పనిసరి అన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ.. విద్వేశాలు రెచ్చగొట్టేలా వ్యవహరిచేవారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిందన్నారు. కోడ్ ఉల్లంఘనపై జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయానికి ఫిర్యాదు చేయవచ్చని, సి విజిల్ యాప్ ద్వారా లైవ్ వీడియోలతో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 06 గంటల వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించొద్దని తెలిపారు. ఆలయాలు, మసీదులు, చర్చిలు, ప్రార్థనా స్థలాలు, పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో రాజకీయ సమావేశాలు నిర్వహించొద్దన్నారు. సమావేశంలో ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్ విజయ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

తాగునీటికి ఇబ్బందిలేకుండా చూడండి

ఎస్ఎస్ తాడ్వాయి : వేసవి కాలంలో తాగునీటికి అవాంతరాలు లేకుండా చూడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీజ తాగు నీటి సరఫరా తీరుపై మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. గ్రామాల్లో నీటి ఇబ్బందులు తీవ్రంగా ఉన్న సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించడానికి ప్రతి గ్రామ పంచాయతీకి సూక్ష్మ ప్రణాళిక (మైక్రో ప్లాన్) తయారు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో ఎన్ని చేతి పంపులు ఉన్నాయి? పనిచేసేవి ఎన్ని? ఎన్ని మరమ్మతులకు గురయ్యాయని ఆరా తీశారు. మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు. గ్రామాల్లోని ప్రతి ఇంటికి తాగు నీరు అందించాలని ఇందుకోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలో స్పష్టత కలిగి ఉండాలని తెలిపారు. నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి సమస్య పరిష్కారం దిశగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఐసీడీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోషణ పక్షం కార్యక్రమానికి కలెక్టర్ హాజరైయ్యారు. పౌష్టికాహారం ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించి మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ శ్రీనివాసరావు, ఎస్ఈ మల్లేశ్, ఈఈ మాణిక్య రావు, ఎన్పీడీసీఎల్ డీఈ నాగేశ్వర రావు, మండల స్పెషల్ ఆఫీసర్ అప్పయ్య, డీడబ్ల్యూఓ స్వర్ణలత, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీఓ సుమనవాణి, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవసేవలో నరసింహుడు

రేగొండ: మండలంలోని కోటంచ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు శుక్రవారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఉదయం నిత్య విధి పూజలు, హోమం నిర్వహించిన అనంతరం స్వామి వారిని బలిహరణము సేవలో ఆలయ ఆవరణలో ఊరేగించారు. తదుపరి తీర్థ ప్రసాదం వితరణ చేశారు. సాయంత్రం స్వామి వారిని ఉత్సవ సేవలో డప్పువాయిద్యాల నడుమ మాడవీధుల గుండా ఊరేగించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ ముల్కనూరి భిక్షపతి, ఆలయ ఈఓ బిల్లా శ్రీనివాస్, కమిటీ సభ్యులు మల్లెబోయిన శ్రీధర్, మూల ఓంకార్, డోబిలి కోటేశ్వర్‌రావు, కనుకుంట్ల జోగేందర్, పేరాల తిరుపతి, పోలుసాని శ్రీనివాస రావు, లింగంపల్లి తిరుపతిరావు పాల్గొన్నారు.

ఆలయ సుదర్శనచక్ర ప్రతిష్ఠాపన

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని సీతారామ చంద్రస్వామి ఆలయం గోపురం సుదర్శన చక్ర ప్రతిష్ఠాపన పూజలు శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగాయి. వేదపండితులు హగ్రీవాటచారి, మురళీ మోహన్, మణికంటశర్మ, అర్చకులు నాగేశ్వర్ రావుశర్మలు గణపతిపూజ, సుదర్శనహోమం, మండపారాధన నిర్వహించి సుదర్శన చక్రాన్ని ఆల య గోపురంపై ప్రతిష్ఠించారు. అనంతరం పూర్ణహుతి చేపట్టారు. జలాదివాసం, ధాన్యాదివాసం, పుష్పాభిషేకం, పూర్ణోత్సవ పూజలను నిర్వహించారు. మహా అన్నదానం చేపట్టారు. ప్రతిష్ఠాపన పూజలకు రాష్ట్ర మంత్రి సీతక్క, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్‌లు శుక్రవారం హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించగా.. కమిటీ సభ్యులు వారిని సన్మానించారు. ఆలయ కమిటీ చైర్మన్ మోడెం రమేష్, దీన బాంధుస్వామి, అలువాల శ్రీనివాస్, సంతోష్, బాల్య ప్రసాద్, బ్రహ్మం, సదానందం, గంపల శివ కుమార్, కత్తెర శ్రీనివాస్, మాజీ చైర్మన్ పోగుల లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేదపండితులు

అవినీతి మరక..

- నాట్లు వేసిన చేతులతోనే నోట్ల కట్టల స్వీకరణ
- సామాజిక సేవా కార్యక్రమాలు, ఉత్తమ అధికారిగా మంచి పేరు
- ఏసీబీకి పట్టుబడిన మహబూబాబాద్ సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా

సాక్షి, మహబూబాబాద్: ఆమె ఓ ఉన్నతాధికారి.. వృత్తి ఉద్యోగం అయినా.. ప్రవృత్తి మాత్రం సామాజిక సేవ. పేదరికాన్ని చవిచూసిన ఆమెకు పేదలు అంటే ఇష్టం.. వారికి సేవచేయడం మరీ ఇష్టం. నాట్లు వేసి, కూలి పనిచేసి వచ్చిన డబ్బులతో పేదలకు సహాయం చేస్తుంది. లంచం అడిగితే ఆమెకు కోపం .. లంచం తీసుకునే వారంటే ఆమెకు చిరాకు. ఇది మహబూబాబాద్ సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహమ్మద్ జీవితం. అయితే ఇదంతా శుక్రవారం సాయంత్రం 4గంటల వరకు అందరు అనుకునే మాటలు. కానీ ఒక్కసారిగా సీన్ రివర్స్ అయింది. నిప్పులాగా తెరపై కనిపిస్తూ తెరవెనుక అవినీతి సామ్రాజ్యం దాగుందని బయటపడింది. భూమి రిజిస్ట్రేషన్ చేసేందుకు రూ. 19,200 లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులకు చిక్కింది.

సామాజిక సేవలో..

సామాజిక సేవా కార్యక్రమాలు చేసే మంచి అధికారిగా తస్లీమాకు ఉమ్మడి జిల్లాలో పేరుంది. నిరుపేద ముస్లిం కుటుంబంలో పుట్టిన ఆమె చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయింది. కష్టపడి ఉన్నత చదువులు చదివింది. సబ్‌రిజిస్ట్రార్‌గా ఉద్యోగం సంపాదించింది. ఈ నేపథ్యంలో కరోనా బాధితులకు ఆమె ప్రస్తుత ములుగు ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి సీతక్కతో కలిసి చేసిన సేవలు ఇప్పటికీ ములుగు ప్రాంతం ప్రజలు గుర్తుచేసుకుంటారు. అదేవిధంగా ఆదివారం వస్తే నాట్లు వేయడం, కూలీ పనులు చేయడం, పేద విద్యార్థులకు సహాయం చేయడం, నిరుపేద గుడిసెల్లో ఉండేవారితో గడపడం ఇలా ఆమె చేసిన సేవా కార్యక్రమాలను ప్రచారం చేయని టీవీ చానళ్లు లేవు.. రాయని పేపర్లు లేవు. సోషల్ మీడియాలోనూ ఆక్టివ్‌గా ఉండేది.



లంచం తీసుకుంటూ..

ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ చేసేందుకు సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా రూ.19,200 లంచంగా ఇవ్వాలని దంతాలపల్లి మండలం దాట్ల గ్రామానికి చెందిన గుండగాని హరీశ్‌ను డిమాండ్ చేసింది. దీనికి హరీశ్ ఒప్పుకోవడంతో ఆఫీసులో పని చేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి ఇవ్వాలని సూచించింది. అయితే సదరు వ్యక్తి ఏసీబీని ఆశ్రయించి పట్టించాడు. సామాజిక కార్యకర్తగా అందరి మన్ననలు పొందిన సబ్ రిజిస్ట్రార్ తస్లీమా లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కడం జిల్లా వ్యాప్తంగా చర్చగా మారింది.

క్లుప్తంగా

ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా కేసముద్రం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లు సాంబయ్య, వీరన్నను సస్పెండ్ చేసినట్లు ఎస్పీ సుధీర్ రాం నాథ్ కేకన్ శుక్రవారం తెలిపారు. ఇసుక రవాణా చేస్తున్న క్రమంలో సదరు కానిస్టేబళ్లు.. ఓ వాహన డ్రైవర్‌పై దౌర్జన్యానికి పాల్పడారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరలైంది. దీంతో ఉన్నతాధికారులు విచారణ చేపట్టగా .. సదరు కానిస్టేబుళ్లు.. వాహన డ్రైవర్‌పై దౌర్జన్యానికి పాల్పడింది నిజమేనని నిరూపణ అయ్యింది. దీంతో ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఎవరు చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

వాక్యానికి భిన్నంగా కవిత్వం ఉండాలి

- ప్రముఖ రచయిత, విమర్శకురాలు కాత్యాయని విద్మహే



హన్మకొండ కల్చరల్: సాధారణ వాక్యానికి భిన్నంగా కవిత్వం ఉండాలని, లోతైన భావాలతో కవి నిరంతరం సంఘర్షణకు గురైనప్పుడే మంచి కవిత్వం వస్తుందని ప్రముఖ రచయిత, విమర్శకురాలు కాత్యాయని విద్మహే అన్నారు. హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ స్కూల్‌లో శ్రీలేఖ సాహితి సమితి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ టి.రంగస్వామి అధ్యక్షతన గురువారం రాత్రి జరిగిన కార్యక్రమంలో కవయిత్రి డాక్టర్ బండారి సుజాత రచించిన 'వేకువ పుష్పం' కవితా సంపుటి, 'వెలుతురు చూడని యెన్నియలు' కథాసంపుటిని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాత్యాయని విద్మహే ముఖ్యఅతిథిగా పాల్గొని పుస్తకాలను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రముఖ కవి బిల్ల మహేందర్, సింగరాజు రమాదేవి పుస్తకాల సమీక్ష చేశారు. ఈకార్యక్రమంలో కవులు అన్నవరం దేవేందర్, సత్యనారాయణ, అనిశెట్టి రజిత, పొట్లపల్లి శ్రీనివాసరావు, పి.చందు, నాగిళ్ల రామశాస్త్రి, పల్లె నాగేశ్వరరావు, గట్టు రాధిక, బాలబోయిన రమాదేవి, వల్సపైడి తదితరులు పాల్గొన్నారు.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్ నిలిపివేత

- ప్రయాణికుల ఆగ్రహం

కాజీపేట రూరల్: ముంబాయి నుంచి భువనేశ్వర్ వెళ్లే కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలు వరంగల్ – నెక్కొండ రైల్వే స్టేషన్ల మధ్య గల చింతల్‌పల్లి రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం నిలిపారు. అప్పటికే గంటన్నర ఆలస్యంతో నడుస్తున్న రైలును వందేభారత్ ఎక్స్‌ప్రెస్ కోసం చింతల్‌పల్లి స్టేషన్ సమీపంలో అరగంట పాటు అధికారులు నిలిపివేశారు. దీంతో జనరల్ బోగి ప్రయాణికులు లోకోపైలెట్ వద్దకు వెళ్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం రెండున్నర గంటల పాటు ఆలస్యంగా కోణార్క్ ఎక్స్‌ప్రెస్ నడుస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు.

మహిమాన్వితం శ్రీచెన్నకేశవస్వామి..



గుట్టపై ఉన్న దేవుని గుండం



ఉత్సవ విగ్రహం

- నేటి నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు
- 25న స్వామి వారి కల్యాణం

దామెర : మహిమాన్విత శ్రీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు నేటి (ఆదివారం) నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. కలియుగ దైవంగా భక్తులు కోర్కెలు తీర్చి కొంగు బంగారంగా వెలుగొందుతున్నాడు శ్రీ చెన్నకేశవ స్వామి. హనుమకొండ జిల్లా దామెర మండలం కోగిల్వాయి చంద్రగిరి గట్లపై కొలువున్న శ్రీ చెన్నకేశవస్వామికి వందల ఏళ్ల నాటి చరిత్ర ఉంది. చంద్రగిరి గుట్టల్లో 12వ దశాబ్దంలో కాకతీయుల ఆధ్వర్యంలో పాలన సాగినట్లు గుట్టపై చారిత్రక ఆధారాలు ఉన్నాయి. లేదళ్ల జిల్లాజి, కర్ణాలు, మాచర్ల వంశస్తులు పాలన సాగించినట్లు చరిత్ర చెబుతోంది. ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన చంద్రగిరి చెన్నకేశవ స్వామి మహిమలు కలిగిన దైవంగా భక్తుల నమ్మకం. గజేంద్ర మోక్షం చంద్రగిరి గట్లపై జరిగిందని ప్రతీతి.

మూడు గుడులు, ఏడు కోనేరులు

చంద్రగిరి గట్లు కోగిల్వాయి, పులుకుర్తి, సింగరాజుపల్లి పొలిమేరల్లో విస్తరించి ఉన్నాయి. గుట్టపై శ్రీ చంద్రగిరి చెన్నకేశవ స్వామి ఆలయంతో పాటు పురాతన శివాలయం, ఆంజనేయ స్వామి ఆలయాలు కూడా ఉన్నాయి. గుట్టపై ఏడు గుండాలు ఉన్నాయి అందులో దేవుడి గుండం(పెద్ద గుండం)లో భక్తులు స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుంటారు. దీంతో పాటు చాకలి గుండం, జిల్లెల్ల గుండం, హరిజన గుండం, కొత్త దేవుడి గుండం, ముని గుండం, అవుసలి గుండాలు సహజ సిద్ధంగా ఏర్పడ్డాయి.

నేటి నుంచి జాతర ప్రారంభం

ఈనెల 23 నుంచి జాతర ప్రారంభం కానుండడంతో వేద పండితుల మంత్రోచ్చరణలు, డప్పు చప్పుళ్ల మధ్య గ్రామంలోని దేవాలయం నుంచి స్వామి వారు గుట్ట పైకి చేరుకుంటారు. ఈ నెల 25న హోలీ రోజున శ్రీదేవి–భూదేవి సహిత చెన్నకేశవ స్వామికి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. 26 నుంచి జాతర జరిగిన అనంతరం ఏప్రిల్ 7న స్వామి వారు గుట్టపై నుంచి ఊరేగింపుగా తిరిగి గ్రామంలోని ఆలయానికి చేరుకోవడంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

జాతరకు ఏర్పాట్లు పూర్తి



చంద్రగిరి గుట్టపై 15 రోజులపాటు జరిగే శ్రీ చెన్నకేశవస్వామి జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తుల సౌకర్యార్థం గుట్ట పైకి రోడ్డు నిర్మించాం. మంచి నీటి సదుపాయం కల్పించడంతో పాటు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశాం. ప్రకృతి సహజసిద్ధ కలిగిన చంద్రగిరి గుట్టను పర్యాటక ప్రాంతంగా గుర్తించి అభివృద్ధి చేయాలి.

–గుండ సురేష్, జాతర కమిటీ చైర్మన్

భారీగా పీడీఎస్ బియ్యం పట్టివేత

- 700 క్వింటాళ్లు స్వాధీనం



పట్టుకున్న పీడీఎస్ బియ్యంతో అధికారులు,

కాళేశ్వరం: తెలంగాణ మీదుగా మహారాష్ట్రకు తరలిపోతున్న పీడీఎస్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ శశిధర్‌రాజు ఆధ్వర్యంలో పది మంది బృందం శుక్రవారం తెల్లవారుజామున జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం జాతీయ రహదారి 353(సీ) మీదుగా మహారాష్ట్రకు తరలుతున్న రెండు లారీలు, రెండు బొలెరా వాహనాలను పట్టుకున్నారు. పట్టుకున్న లారీలు, బొలేరా వాహనాలను కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడ సివిల్ సప్లయ్, రెవెన్యూ అధికారులతో పంచనామా నిర్వహించారు. పీడీఎస్ బియ్యం కొయ్యూరులోని రైస్ మిల్లుకు తరలించారు. పట్టుకున్న బియ్యం సుమారు 700 క్వింటాళ్ల వరకు ఉంటుందని తెలిసింది. రెండు లారీలు, రెండు బొలెరో వాహనాల డ్రైవర్లపై కేసు నమోదు చేశారు. వారి వాంగ్మూలం ఆధారంగా ఎక్కడి నుంచి ఎక్కడి తరలిపోతుందనే వివరాలను సేకరించి వారిపైనా కేసు నమోదు చేయనున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. దాడుల్లో సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీలు ప్రభాకర్, శ్రీధర్‌రెడ్డి, సీఐలు ప్రసాద్, లక్ష్మారెడ్డి, ఎస్సైలు శ్రీనివాస్, జంగయ్య పాల్గొన్నారు. బియ్యం పట్టుకున్నాక స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మహదేపూర్ సీఐ, ఎస్సై ఘటనాస్థలికి చేరుకున్నారు.

బీజేపీకే మాదిగల మద్దతు

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

నయీంనగర్: ఎస్సీ వర్గీకరణ హామీ నిలవాలంటే మళ్లీ మోదీ పీఎం కావాలి.. బీజేపీకే మాదిగల పూర్తి మద్దతు ఉంటుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. శుక్రవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమవుతుందని, మాదిగలకు రాజకీయ ఎదుగుదల ఉంటుందని అన్నారు. రాహుల్‌గాంధీ చుట్టూ మాలల క్యాంపు ఉందని, మాదిగలకు న్యాయం జరగదన్నారు. ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అడ్డుగా ఉన్నారని ఆరోపించారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాదిగలు ఎదగకుండా అణిచివేస్తున్నాడని, అప్పటి ఉపముఖ్యమంత్రి డాక్టర్ రాజయ్య బర్తరఫ్‌కు కడియం శ్రీహరే కారణమని చెప్పారు. మాదిగలను అణిచివేస్తున్న బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయవద్దని కోరారు. పది మంది ఎమ్మెల్యేలు ఉన్నా కేసీఆర్ మాదిగలకు మంత్రి పదవి ఇవ్వలేదన్నారు. 'బీఆర్ఎస్‌లో ఎవరూ ఉండరు.. జారిపోతున్నారు. ఆ పార్టీ నుంచి పోటీ చేయడానికి అభ్యర్థులు భయపడుతున్నారు' అని పేర్కొన్నారు.

సీఐ అరెస్ట్.. రిమాండ్

- తల్లిని పెళ్లి చేసుకున్నాడు.. కూతురుపై కన్నేశాడు
- బాధితురాలి తల్లి ఫిర్యాదు.. ఏసీపీ ఆధ్వర్యంలో విచారణ



సంపత్(ఫైల్)

హసన్‌పర్తి: మైనర్‌పై అత్యాచారానికి యత్నించిన ఘటనలో ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శుక్రవారం అరెస్టయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. వివరాలు ఇలా ఉన్నాయి. భూపాలపల్లి జిల్లా సైబర్ క్రైంలో బండారి సంపత్ సీఐగా విధులు నిర్వహిస్తున్నాడు. వర్ధన్నపేట ఎస్సైగా పనిచేస్తున్న సమయంలో ఓ వివాహితతో ఏర్పడిన పరిచయం లైంగిక బంధానికి దారితీసింది. దీంతో సదరు మహిళ తన భర్తను వదిలిపెట్టి కొంతకాలంగా సంపత్‌తో సహజీవనం సాగించి.. తర్వాత వివాహం చేసుకున్నారు. ఆమెకు అప్పటికే పదేళ్ల వయసు కూతురు ఉంది. ప్రస్తుతం ఆ బాలిక ఇంటర్మీడియట్ చదువుతోంది. అయితే ఆ బాలికకు తండ్రిగా వ్యవహరించాల్సిన సీఐ కీచకుడిగా మారాడు. ఇటీవల అత్యాచారానికి యత్నించడంతో బాలిక తల్లి కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి విచారణ చేపట్టారు. లైంగిక దాడికి యత్నించినట్లు నిర్ధారణకు వచ్చి సీఐ సంపత్‌పై పోక్సో కేసు నమోదు చేశారు.

రెండేళ్లక్రితం సంపత్‌పై ఫిర్యాదు..

ఎస్సై బండారి సంపత్ మాయమాటలు చెప్పి తన భార్యను తీసుకెళ్లాడని రెండేళ్ల క్రితం అప్పటి పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషిని కలిసి ఆమె భర్త ఫిర్యాదు చేశాడు. అప్పుడు కాకతీయ యూనివర్సిటీ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న సంపత్‌ను ఏఆర్‌కు అటాచ్ చేశారు.

ఆయిల్ పామ్.. అధిక లాభం

- ప్రస్తుత సమయంలో పంటలో జాగ్రత్తలు తీసుకోవాలి
- లేకపోతే చేతికందని పరిస్థితి
- అన్నదాతలకు ఉద్యానశాఖ అధికారి రమేష్ పలు సలహాలు, సూచనలు



చెన్నారావుపేట: ఆయిల్‌పామ్ పంట సాగు చేస్తున్న రైతులు ప్రస్తుత సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. లేనిపక్షంలో పంట ఎదుగుదల, దిగుబడిలో నష్టం వాటిల్లుతుంది. మార్చి, ఏప్రిల్ నెలలో పంట పరిస్థితిని బట్టి రైతులు అధికారుల సూచనలు పాటించి సాగు చేపట్టాలి. తద్వారా అధిక లాభాలు లభిస్తాయి. ఈ నేపథ్యంలో పంట జాగ్రత్తలపై ఉద్యానశాఖ అధికారి రమేష్.. అన్నదాతలకు పలు సలహాలు, సూచనలు తెలిపారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే.. నీటి వసతి సమృద్ధిగా ఉన్న పొలాల్లో 9 మీటర్ల దూరం ఉండేలా త్రిభుజాకార లేదా చతురస్రాకార పద్ధతిలో మొక్కలు నాటుకోవాలి. ఎదిగిన ఆయిల్ పామ్ తోటల్లో రోజూ మొక్కకు 250 లీటర్ల నీటిని అందించాలి. ఎదిగిన తోటలకు నెలకు ఎకరాకు 5 కేజీల యూరియా, 3 కేజీల డీఏపీ, 5 కేజీల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను నీటిలో కరిగించి బిందు లేదా తుంపర సేద్య పరికరాల ద్వారా మొక్కలకు అందించాలి. అబ్లేషన్ సాధనంతో 3 సంవత్సరాల్లోపు వయస్సుగల తోటల్లో నూ పూల గుత్తులు తొలగించాలి. ఎదిగిన తోటల్లో ప్రతి మొక్కకు యూరియా 6 గ్రాములు, సీఎం. సూ.ఫా 940 గ్రాములు, పొటాష్ 500 గ్రాములు వేయాలి. లేదా నేల, పత్ర విశ్లేషణ సిఫారసు మేరకు ఎరువులు అందించాలి. ఎదిగిన తోటల్లో ముక్కలు చేసిన ఆకులు, మగపూలగుత్తులు, ఖాళీ గెలలతో ఆయిల్‌పామ్ పాదుల్లో మల్చింగ్ చేయాలి. ఎదిగిన తోటల్లో అల్యూమినియం కడ్డీకి కత్తిని బిగించి గెలలను కోయాలి. గెల కాడ 5 సెం. మీ మాత్రమే ఉంచాలి. పాదుల్లో దున్నొద్దు.

ఏప్రిల్ నెలలో..

లేత ఆయిల్‌పామ్ మొక్క పాదుల్లో జనుము పచ్చిరొట్ట ఎరువుగా నాటుకోవాలి. ఎదిగిన తోటల్లో రోజూ మొక్కకు 265 లీటర్ల నీటిని అందించాలి. మొక్క పాదుల్లో కలుపు నివారణకు గ్లైపోసేట్ అమోనియా లేదా పారాక్వాట్ కలుపు నాశని మందును 2.5 మి.లీ ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఎదిగిన తోటలకు నెలకు ఒక ఎకరాకు 5 కేజీల యూరియా, 3 కేజీల డీఏపీ, 5 కేజీల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను నీటిలో కరిగించి బిందు లేదా తుంప సేద్య పరికరాల ద్వారా మొక్కలకు అందించాలి. అబ్లేషన్ సాధనంలో 3 సంవత్సరాల్లోపు వయస్సుగల తోటల్లోని పూల గుత్తులను తొలగించాలి. ఎదిగిన తోటల్లో ముక్కలు చేసిన ఆకులు, మగపూలగుత్తులు, ఖాళీ గెలలతో పంట పాదుల్లో మల్చింగ్ చేయాలి. మట్టి, పత్ర విశ్లేషణ కోసం నమూనాలు సేకరించి పంపాలి. ఎదిగిన తోటల్లో అల్యూమీనియం కడ్డీకి కత్తిని బిగించి గెలలను కోయాలి. గెల కాడ 5 సెం.మీ మాత్రమే ఉంచాలి. పాదుల్లో దున్నొద్దు.

ఇద్దరు పిల్లలతో బావిలో దూకిన తల్లి

- తల్లీ, కూతురు మృతి
- ప్రాణాలతో బయటపడిన కుమారుడు
- కుటుంబ కలహాలే కారణం!



మృతిచెందిన తల్లీ కూతురు లావణ్య, నిత్యశ్రీ

నెల్లికుదురు: కుటుంబ కలహాల కారణంగా ఓ తల్లి తన కూతురు, కుమారుడితో కలిసి బావిలో దూకిన సంఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం శ్రీరామగిరి శివారు వెంకటాపురంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆకుల లావణ్య(30) కుటుంబ కలహాల కారణంగా మనోవేదనకు గురైంది. ఈ మేరకు తన కూతురు నిత్యశ్రీ(6), ముకేష్(10)తో కలిసి తన ఇంటి సమీపాన ఉన్న మంచినీటి బావిలో దూకింది. దీంతో లావణ్య, నిత్యశ్రీ నీట మునిగి చనిపోగా కుమారుడు ముకేష్ ఈదుకుంటూ బావిలోని పైపును పట్టుకుని ప్రాణాలతో బయటపడ్డాడు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

బయ్యారం: మద్యానికి బానిసై మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం నర్సా తండాకు చెందిన భూక్య నాను(41) శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. నానూ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో ఈనెల 6న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతుండగా.. పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి భార్య జ్యోతి ఫి ర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏసీబీకి చిక్కిన సబ్ రిజిస్ట్రార్ తస్లీమా

రూ.19,200 లంచం తీసుకుంటుండగా పట్టివేత

- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి వెంకటేష్ అరెస్ట్
- వివరాలు వెల్లడించిన వరంగల్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య
- లెక్క చూపని రూ.1.72లక్షల నగదు స్వాధీనం



పట్టుబడిన సబ్ రిజిస్ట్రార్ తస్లీమా, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి వెంకట్



పట్టించిన బాధితుడు హరీష్

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహమ్మద్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగి వెంకటేష్ అలియాస్ వెంకట్ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం చోటుచేసుకున్న ఈఘటన వివరాలను వరంగల్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య వెల్లడించారు. జిల్లాలోని దంతాలపల్లి మండలం దాట్ల గ్రామానికి చెందిన గుండగాని హరీష్.. దంతాలపల్లి మండల కేంద్రంలో 128 గజాల భూమి కొనుగోలు చేశాడు. రిజిస్ట్రేషన్ చేసేందుకు సబ్ రిజిస్ట్రార్ తస్లీమా గజానికి రూ.200 చొప్పున డిమాండ్ చేయగా.. రూ.150 చొప్పున ఇస్తానని బేరం కుదుర్చుకుని వరంగల్ జిల్లా కేంద్రంలోని ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. శుక్రవారం సాయంత్రం మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ పూర్తికాగానే రూ.19,200 నగదును అవుట్ సోర్సింగ్ ఉద్యోగి వెంకటేష్‌కు ఇవ్వమని సబ్ రిజిస్ట్రార్ చెప్పగా.. హరీష్ ఆ డబ్బులను అందజేస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వెంకట్ వద్ద లెక్క చూపని మరో రూ.1.72లక్షలు నగదు ఉండగా స్వాధీనం చేసుకున్నారు. సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహమ్మద్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఆలేటి వెంకట్‌ను అదుపులోకి తీసుకుని వరంగల్‌లోని ఏసీబీ కోర్టుకు తరలించారు. ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని విజ్ఞప్తి చేశారు. దాడుల్లో ఏసీబీ సీఐలు శ్యాంసుందర్, రాజు, సునీల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

శిల్పమా.. రాయా?



తవ్వకాల్లో బయటపడిన భారీ రాయి(శిల్పం) ఇదే



రాయి బయటపడిన ప్రదేశం (సర్కిల్‌లో)

- పురావస్తుశాఖ తవ్వకాల్లో వెలుగులోకి..
- బయటకు తీయకుండానే మట్టిని పూడ్చేసిన సిబ్బంది

వెంకటాపురం(ఎం): ప్రపంచ ప్రసిద్ధి చెందిన రామప్ప దేవాలయ ఆవరణలో పురావస్తుశాఖ సిబ్బంది పైపులైన్ నిర్మాణం కోసం చేపట్టిన తవ్వకాల్లో 5 ఫీట్ల పొడవుతో ఉన్న శిల్పం లాంటి రాయి కనిపించింది. రాయిని బయటకు తీసే ప్రయత్నం చేసినప్పటికీ సిబ్బందికి సాధ్యం కాలేదు. చివరికి ఉన్నతాధికారులకు సమాచారం అందించి జేసీబీ సాయంతో తీసేందుకు యత్నించగా.. శిల్పం అయితే జేసీబీ కారణంగా దెబ్బతింటుందని ప్రయత్నాన్ని విరమించుకున్నారు. రాయా.. శిల్పామా? అంటూ.. ఎటూ తేల్చుకోలేక పురావస్తు శాఖ సిబ్బంది ఆ ప్రయత్నాన్ని మానుకోని బయటపడిన రాయి పక్క నుంచి పైపులైన్ వేశారు. రాయిపై తీసిన మట్టిని యాథావిధిగా పోసి పూడ్చివేశారు. దీంతో బయటపడింది రాయా.. శిల్పామా? అంటూ పురావస్తుశాఖ సిబ్బందితో పాటు స్థానికులు చర్చించుకుంటున్నారు.

సోమసూత్రం ద్వారా నీరు బయటకు వెళ్లేందుకు పైపులైన్

'సాక్షి' కథనాలతో సోమసూత్రాన్ని పునరుద్ధరిస్తున్న కేంద్ర పురావస్తుశాఖ అధికారులు ఆలయ గర్భగుడిలో నుంచి వచ్చే నీరు (ద్రవం) ఆలయం బయటకు వచ్చేలా డ్రిల్లింగ్ పనులు చేపట్టి పూర్తి చేశారు. అక్కడి నుంచి ఆలయ ప్రాకార గోడ దాటి నీరు వెళ్లేలా సుమారు 15 మీటర్లు పైపులైన్ వేసేందుకోసం తవ్వకాలు జరిపారు. సుమారు ఫీట్ లోతుతో పైపులైన్ కోసం తవ్వకాలు జరుపుతున్న క్రమంలో రాయి కనిపించింది. గతంలో పలుమార్లు ఆలయ పరిసరాల్లో తవ్వకాలు జరిపినప్పుడు అనేక శిల్పాలు వెలుగుచూసాయని స్థానికులు పేర్కొంటున్నారు. రాయి అయినా శిల్పమైనా అధికారులు బయటకు తీయాల్సి ఉండగా తమకెందుకులే అనే రీతిలో తవ్వకాల్లో బయటపడిన రాయి (శిల్పం)పై మళ్లీ మట్టి కప్పి పూడ్చడంపై స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వెలుగుచూసిన రాయిని బయటకు తీస్తే శిల్పామా? రాయా అనేది తెలుస్తుందని పర్యాటకులు పేర్కొంటున్నారు.

పలువురికి జరిమానా, శిక్ష

రామన్నపేట: లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతూ పట్టుబడిన ముగ్గురు వాహనదారులకు వరంగల్ సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి రూ.3,800 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీధర్ పేర్కొన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 9 మందికి రూ.15,900 జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. అలాగే వరంగల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రైవింగ్ అర్హత లేని 8 మందిని గుర్తించి శుక్రవారం జువైనల్ కోర్టులో చార్జిషీట్ ఫైల్ చేయగా.. రెండు రోజులు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ తెలిపారు.

క్షుద్రపూజల కలకలం..

- వెంకటాపురంలో ఇళ్ల ఎదుట మృతుల ఎముకలు
- దర్యాప్తు చేపడుతున్న పోలీసులు



మాజీ సర్పంచ్ రమేష్ ఇంటి ఎదుట మృతుల ఎముకలతో ఏర్పాటు చేసిన కుండ, చాటా, చీపురు

పరకాల: గుర్తుతెలియని వ్యక్తులు.. ఓ ఆర్ఎంపీ, మాజీ సర్పంచ్ ఇళ్ల ఎదుట మృతుల ఎముకలతో క్షుద్రపూజలు చేశారు. ఈ ఘటన పరకాల మండలం వెంకటాపురంలో కలకలం రేపింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఆర్ఎంపీ సదన్ కుమార్, ఇంటి ముందుతో పాటు మాజీ సర్పంచ్ ఇనుగాల రమేష్ కొత్త ఇంటిని నిర్మించుకుంటున్న తరుణంలో గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి క్షుద్రపూజలు చేశారు. చాలా చోట్ల క్షుద్రపూజలలో కోళ్లు, మేకలకు సంబంధించిన తలలు, కోడిగుడ్లు వాడుతుండగా వెంకటాపురంలో జరిగిన క్షుద్రపూజల్లో శ్మశాన వాటిక నుంచి కుండల్లో తీసుకొచ్చిన మృతుల ఎముకలను కాల్చి పసుపు, కుంకుమతో పాటు చాటలను వారి ఇళ్ల ఎదుట ఏర్పాటు చేశారు. దీంతో ఊరికి వెళ్లి వచ్చి సరికే ఇళ్ల ఎదుట క్షుద్ర పూజలు చేసి ఉండడంతో కుటుంబీకులు, గ్రామస్తులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఇళ్లలోకి వెళ్లడానికి కూడా సాహసించలేక పోలీసులకు సమాచారం అందించారు. దీంతో క్షుద్రపూజలు జరిగాయా? లేక భయపెట్టేందుకు ఎవరైనా ఆకతాయిలు కావాలనే నాటకం ఆడారా? అనే విషయంపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.